బుధవారం సెప్టెంబరు 6, 2006 ఈనాడు హైదరాబాద్ 5

# దార్శనికుడు ఎల్వీప్రసాద్

## స్మారక తపాలా బిళ్ల విడుదల

### ప్రభుత్వం తనను తాను గౌరవించుకుంది: రామోజీరావు




మంగళవారం హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ఎల్వీప్రసాద్ స్మారక తపాలా బిళ్లను విడుదల చేస్తున్న కేంద్ర ఐటీ, కమ్యునికేషన్ల సహాయ మంత్రి షకీల్ అహ్మద్. చిత్రంలో ఈనాడు గ్రూపు సంస్థల ఛైర్మన్ రామోజీరావు, రాష్ట్ర చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ యశోధర మీనన్, కేంద్ర మంత్రి దాసరి నారాయణరావు, రమేష్‌ప్రసాద్, ఆర్థికమంత్రి రోశయ్య, కేంద్ర తపాలా సర్వీసుల బోర్డు సభ్యుడు కైలాష్ ప్రసాద్, సినీనటుడు కమల్‌హాసన్, డి.వి.ఎస్.రాజు.

హైదరాబాద్ - న్యూస్‌టుడే

**చ**లన చిత్ర పరిశ్రమకు ఎనలేని సేవలందించిన ఎల్వీ ప్రసాద్ స్మారకార్థం కేంద్ర ప్రభుత్వం తపాలా బిళ్లను విడుదల చేసింది. కేంద్ర కమ్యూనికేషన్లు, ఐటీ శాఖ సహాయ మంత్రి షకీల్ అహ్మద్ మంగళవారం హైదరాబాద్‌లో దాన్ని ఆవిష్కరించారు. సినిమాయే ఊపిరిగా జీవించి కలలను సాకారం చేసుకున్న దార్శనికుడే ఎల్వీ ప్రసాద్ అని ఈ సందర్భంగా ఆయన ప్రశంసించారు. కమల్‌హాసన్ వంటి ప్రతిభావంతుడైన నటుణ్ని హిందీ పరిశ్రమకు పరిచయం చేశారని గుర్తు చేశారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య మంత్రి రోశయ్య, కేంద్ర బొగ్గు గనుల సహాయ మంత్రి దాసరి నారాయణరావు, 'ఈనాడు' గ్రూపు సంస్థల ఛైర్మన్ రామోజీరావు, సినీ నటుడు కమల్ హాసన్, కేంద్ర తపాలా బోర్డు సభ్యుడు కైలాష్ ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ సర్కిల్ ఛీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ యశోధర మీనన్, ప్రముఖ నిర్మాత డీవీఎస్ రాజు, ప్రముఖ నేత్ర వైద్యులు నాగేశ్వరరావు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

### సినీ వ్యవస్థకు పాఠ్య పుస్తకం: రామోజీరావు

వ్యక్తి నుంచి వ్యవస్థగా ఎదిగిన ఎల్వీ ప్రసాద్ భారతీయ సినిమాకు పాఠ్యపుస్తకమేనని 'ఈనాడు' గ్రూపు సంస్థల ఛైర్మన్ రామోజీరావు ప్రశంసించారు. వెండిజుట్టు, వెన్నెలలాంటి నవ్వుతో కనిపించే ఆయన్ను తలచుకుంటే సినిమా రీళ్ల మాదిరిగా ఆయన జీవితం కళ్లముందు కదలాడుతుందని పేర్కొన్నారు. "సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చిన ఆయనకు ఆస్తులు లేవు. పెద్ద చదువులు అంతకన్నా లేవు. గుండెనిండా సినిమాపై ప్రేమతో ముంబయి వెళ్లి ఎన్నో కష్టాలు అనుభవించారు. ఆ కష్టాలు వింటే కళ్లు చెమర్చక తప్పదు" అంటూ భావోద్వేగానికి లోనయ్యారు. మనిషి తలచుకుంటే సాధించలేనిది ఏదీ లేదనడానికి ప్రసాద్ జీవితమే తార్కాణమన్నారు. 'కత్తి కన్నా కలం గొప్పదని, కలం కన్నా ఫిలిం గొప్పదని' ఆయన ఓ సందర్భంలో అన్నట్లు రామోజీరావు గుర్తుచేసుకున్నారు. సినిమా పరిశ్రమకు రుషిలాంటి ఆయన కృషికి గుర్తింపుగా తపాలా బిళ్లను విడుదల చేసి కేంద్ర ప్రభుత్వం తనను తాను గౌరవించుకుందని చెప్పారు.

### ఎందరికో స్ఫూర్తి: రోశయ్య

కేవలం వంద రూపాయలతో ఇంతటి సామ్రాజ్యాన్ని స్థాపించి ఎల్వీప్రసాద్ ఎందరికో స్ఫూర్తిగా నిలిచారని మంత్రి రోశయ్య ప్రశంసించారు. ఎల్వీ ప్రసాద్.. టైలర్ షాపులో చీపురుతో ఊడ్చినప్పటి నుంచి స్టుడియో యజమాని స్థాయి దాకా ఎదిగారన్నది కథ కాదని జీవితమని కేంద్ర మంత్రి దాసరి అన్నారు. సినీ పరిశ్రమలో ఉన్న చిరస్మరణీయుల్లో వేళ్లపై లెక్కపెట్టగలిగే వ్యక్తుల్లో ఎల్వీ ప్రసాద్ ఒకరని సినీనటుడు కమల్ హాసన్ వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ తపాలా బిళ్లల సేకరణకర్త జింకా సుబ్రహ్మణ్యంను ఎల్వీ ప్రసాద్‌గ్రూప్ తరపున సన్మానించారు. ఎల్వీ ప్రసాద్ జీవిత చరిత్ర పుస్తకాన్ని మంత్రి రోశయ్య విడుదల చేశారు. సినీ ప్రముఖులు డాక్టర్ రామానాయుడు, వి.బి.రాజేంద్రప్రసాద్, మురళీమోహన్, దొరస్వామిరాజు, తదితరులు పాల్గొన్నారు.